క్లుప్తంగా

నిరాశ్రయుల వసతిగృహంలో మందుల పంపిణీ



వృద్ధులకు మందులు పంపిణీ చేస్తున్న అవోపా కమిటీ సభ్యులు

బద్వేలు అర్బన్: స్థానిక తెలుగగుంగకాలనీ రోడ్డులోని నిరాశ్రయుల వసతిగృహంలో అవోపా ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు చెందిన రెక్సర్ ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో వృద్ధులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అవోపా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నూకలరెడ్డెయ్య, సి.వి.నాగేశ్వరరావులు మాట్లాడుతూ అవోపా ఆధ్వర్యంలో చేస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా నిరాశ్రయుల వసతిగృహంలో ఉండే వృద్ధులకు అనారోగ్య సమస్యలు ఉండకూడదన్న ఉద్దేశ్యంతో మందుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో అవోపా ఉపాధ్యక్షుడు సుబ్రమణ్యం, ఆర్థిక కార్యదర్శి తులసిసుబ్రమణ్యం, ఆశ్రమ నిర్వాహకులు రవికుమార్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పశుగణన సర్వే ప్రారంభం



సర్వే పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, ఏపీఎల్‌డీఏ సీఈఓ డాక్టర్ శ్రీనివాసరావు, జేడీ డాక్టర్ శారదమ్మ

ప్రొద్దుటూరు: మండలంలోని కామనూరులో శుక్రవారం 21వ అఖిల భారత పశు గణన సర్వేను ఎమ్మెల్యే నంద్యాల వరద రాజులరెడ్డి, ఏపీఎల్‌డీఏ సీఈఓ డాక్టర్ శ్రీనివాసరావు, జేడీ డాక్టర్ శారదమ్మ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ నెల 25వ తేదీ నుంచి 2025 ఫిబ్రవరి, 28వతేదీ వరకు దేశ వ్యాప్తంగా పశు గణన సర్వే జరుగుతోందన్నారు. రైతులు, పశువుల యజమానులు తమ ఇళ్ల వద్దకు వచ్చే సిబ్బందికి పూర్తి సమాచారం అందించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌డీఏ సీఈఓ డాక్టర్ జి.రమేష్‌బాబు, జమ్మలమడుగు పశు సంవర్ధకశాఖ డీడీ డాక్టర్ వీరబ్రహ్మం, డాక్టర్ ధనుంజయరెడ్డి, డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ సరస్వతి, సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కల్పించాలి

చాపాడు: పోలీసు నిర్వహించే విధులు, వారు అందించే సేవలు, చట్టాలపై విద్యార్థులు అవగాహన కల్పించాలని ఎస్ఐ చిన్న పెద్దయ్య అన్నారు. పోలీసు అమర వీరుల స్మరణ దినోత్సవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులు ఉపాధ్యాయులు చెప్పిన పాఠ్యాంశాలను శ్రద్ధగా విని బాగా చదువుకోవాలన్నారు. సమాజం పట్ల బాధ్యత కూడా ఉండాలని సూచించారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం పోలీసు స్టేషన్ అధికారులు, సిబ్బంది విధి, విధానాలు, తుపాకీలు, కేసుల రికార్డులు, దొంగలపై అవగాహన కల్పించారు.

ముగిసిన ఆధార్ శిబిరాలు

చాపాడు: మండల వ్యాప్తంగా ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకూ విద్యార్థుల కోసం గ్రామ సచివాలయాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ నమోదు శిబిరాలు శుక్రవారంతో ముగిశాయని ఇన్‌చార్జి ఎంపీడీఓ రామానుజం తెలిపారు. ఈ క్రమంలో శుక్రవారం చాపాడులో గ్రామ సచివాలయం వద్ద పంచాయతీ కార్యదర్శి శ్రీధర్ పర్యవేక్షణలో ఆధార్ ప్రత్యేక నమోదు కార్యక్రమం నిర్వహించారు.

ప్రకృతి వ్యవసాయాన్ని అనుసరించండి

మైదుకూరు: రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని అనుసరించాలని మండలంలోని వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి, శాస్త్రవేత్త డాక్టర్ ఎం.బాలకృష్ణ అన్నారు. శుక్రవారం కేవీకే ఆధ్వర్యంలో ఆదిరెడ్డిపల్లెలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎం.బాలకృష్ణ మాట్లాడుతూ ప్రకృతి వ్యయసాయంతో తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయాన్ని పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు ఓబయ్య, ఆదినారాయణ, వెంకటరామయ్య, కేవీకే శాస్త్రవేత్తలు శ్రీవిద్యారాణి, ఫిరోజ్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

బాలికలకు అవగాహన

పోరుమామిళ్ల: మదర్ థెరెసా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని ఉర్దూ బాలికల ఉన్నత పాఠశాలలో 8, 9, 10 తరగతుల బాలికలకు ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. ఫౌండేషన్ వైస్ చైర్మన్ చిత్తా ప్రజ్వలరెడ్డి, బ్రయాన్స్ హాస్పిటల్ డాక్టర్ చిత్తా అమితారెడ్డి విద్యార్థినులకు నెలసరి సమస్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలికలకు యుక్త వయస్సు వచ్చాక పీరియడ్స్ రావడం సహజమన్నారు. ఆ సమయంలో జాగ్రత్తలు తీసుకుంటే ఎలాంటి అనారోగ్య సమస్యలు రావన్నారు. శుభ్రత పాటించాలని, సానిటరీ నాప్కిన్స్ తప్పకుండా వాడాలన్నారు. విద్యార్థినులకు ఎఫ్‌సీఎస్ వ్యవస్థాపకులు తోమాస్ రెడ్డి, డాక్టర్ గీతల సహకారంతో ప్రతి విద్యార్థినికి మెన్‌స్ట్రోపీడియా బుక్స్ ఉచితంగా అందించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వసతి గృహాలు.. అవస్థల నిలయాలు

- మఠంలోని ఎస్సీ వసతి గృహాల్లో మౌలిక వసతులు కరువు
- డోర్‌లు లేని మరుగుదొడ్లు, తాగునీటికి కూడా కష్టాలే
- పట్టించుకోని విద్యాశాఖాధికారులు
- వర్ణనాతీతంగా విద్యార్థుల ఇబ్బందులు



బాలికల హాస్టల్లో విద్యార్థులు నిద్రించే హాలు



బాలికలకు ఉపయోగ పడని మరుగుదొడ్లు

బ్రహ్మంగారిమఠం: మండల కేంద్రంలో ఉన్న రెండు ఎస్సీ బాలికల వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలతో విద్యార్థినులు సతమతమవుతున్నారు. సాగర్ రోడ్డులో ఉన్న ఎస్సీ బాలికల వసతి గృహాలు 3 నుంచి 7 తరగతుల వరుకు ఒకటి, 7 నుంచి 10వ తరగతి వరుకు మరొకటి ఉన్నాయి. రెండు హాస్టల్‌లో దాదాపు 200 మంది విద్యార్థినులు ఉంటున్నారు. 3 నుంచి 7 తరగతుల హాస్టల్‌కు విజయమ్మ, 7నుంచి 10 తరగతుల వరుకు ఉన్న హాస్టల్‌కు వెంకటరమణమ్మలు వార్డెన్‌లుగా వ్యవహరిస్తున్నారు. వార్డెన్‌లు ఎప్పుడు విధులకు వస్తారో.. ఎప్పుడు వెళతారో తెలియని పరిస్థితి కనిపిస్తోంది. హాస్టళ్లలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పైస్థాయి అధికారులకు తీసుకువెళ్లి పరిష్కార చూపాల్సిన వార్డెన్‌లు తమకెందుకు అనేలా వ్యవహరిస్తుండటంతో విద్యార్థినుల పరిస్థితి వర్ణనాతీతంగా ఉంది.

అధ్వానంగా మరుగుదొడ్లు..

రెండు హాస్టల్‌కు మరుగుదొడ్లు ఒకే చోట ఉన్నాయి. వాటికి డోర్లు లేవు. ఉన్నవాటికి సరిగా మరుగుదొడ్లలో నీరు రావు. తాగునీటి సమస్య పరిష్కారం కాలేదు. బాలికలు నిద్రించే హాల్లో ఫ్యాన్లు లేవు, దోమల నివారణకు కిటికీలు లేవు. దీంతో విద్యార్థినులు దోమల బారిన పడి అనారోగ్యాల పాలవుతున్నారు. దోమలు కుడుతుండటంతో రాత్రుళ్లు సరిగా నిద్రలేక ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థినులు తెలియజేశారు. హాస్టళ్లను తనిఖీ చేయాల్సిన అధికారులు ఈ వైపు రాకపోవడంతో ఇక్కడ ఉంటున్న విద్యార్థులు తమ హాస్టల్ దుస్థితి ఎప్పుడు మారుతుందోనని వాపోతున్నారు. గత ప్రభుత్వం రెండు హాస్టళ్ల పూర్తి స్థాయిలో పనులకు టెండర్లు పిలిచి కొంతవరుకు పనులు కూడా చేసింది. ఎన్నికలు రావడంతో పనులు నిలిచిపోయాయి. ప్రభుత్వం మారడంతో కాంట్రాక్టర్ పనులను నిలిపివేశాడు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అధికారులు హాస్టల్స్‌ను పరిశీలించిన ఇంత వరుకు విద్యార్థులకు న్యాయం జరగలేదు. ప్రభుత్వం మాత్రం ఆర్భాటంగా చెప్పుకుంటోంది తప్పా విద్యార్థుల సమస్యలను మాత్రమం ఇంతవరుకు తీర్చలేదని విద్యార్థుల తల్లిదండ్రులు తెలుపుతున్నారు.

బాలికోన్నత పాఠశాలలో నీటి సమస్య

బ్రహ్మంగారిమఠం: మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో నీటి కొరతతో విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నత పాఠశాలలో 400మంది బాలికలు చదువుతున్నారు. మధ్యాహ్న భోజనం పాఠశాలలో ఏర్పాటు చేస్తున్నారు. భోజనం అయ్యాక పాఠశాలలో తాగేందుకు.. అలానే ప్లేట్లు శుభ్రం చేసుకోవాలంటే కూడా నీరు లేక ఇక్కట్లు పడుతున్నారు. పాఠశాల ఆవరణలో మూడు నీటి ట్యాంకులు ఉన్నా అందులో నీరు ఉండడంలేదు. పాఠశాల ప్రధానోపాధ్యారాలు నిర్మలాదేవి మాట్లాడుతూ అరకొర పనులు మా సొంత డబ్బు పెట్టి చేయిస్తున్నాం. ప్రభుత్వం నుంచి స్కూల్ గ్రాంట్ ప్రతి ఏడాది రూ.75వేలు వస్తుంది. ప్రస్తుతం స్కూల్ గ్రాంట్ రాక సమస్యలు పరిష్కారానికి నోచుకోవడంలేదు. ప్రభుత్వం ఇచ్చే నిధులు స్టేషనరీలకు సరిపోతుంది. విద్యార్థులు బోరు నీటినే తాగుతున్నారు.



పాఠశాలలో నిరుపయోగంగా ఉన్న ట్యాంకర్లు

నర్సుల సమస్యల పరిష్కారానికి కృషి



లిల్లీ ఫ్లోరెన్స్‌ను సన్మానిస్తున్న ఎన్జీఓ అసోసియేషన్ ప్రతినిధులు

ప్రొద్దుటూరు క్రైం: నర్సుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఏపీ గవర్నమెంట్ నర్సెస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి లిల్లీ ఫ్లోరెన్స్ తెలిపారు. స్థానిక ఎన్జీఓ హోంలో శుక్రవారం ఏపీఎన్జీఓ అసోసియేషన్ తాలూకా అధ్యక్షుడు కేజే రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో లిల్లీ ఫ్లోరెన్స్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా లిల్లీ ఫ్లోరెన్స్ మాట్లాడుతూ నర్సుల సమస్యల పరిష్కరించడంతో తమ పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ఉద్యోగుల పెండింగ్ బకాయిలు, 11వ పీఆర్సీ అరియర్స్, సరదర్ లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, 12వ పీఆర్సీ కమిటీవేయాలని, అంత వరకు ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. కేజే రఘురామిరెడ్డి మాట్లాడుతూ కడపలో గురువారం జరిగిన ఏపీ గవర్నమెంట్ నర్సెస్ అసోసియేషన్ ఎన్నికల్లో ప్రొద్దుటూరు నుంచి లిల్లీ ఫ్లోరెన్స్ పోటీ చేసి జిల్లా కార్యదర్శిగా ఎన్నికవడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సదాశివ, శ్రీనివాసులు, ప్రమీల, ప్రభంజనరెడ్డి, జయంతి, శివరామానుజం, మధు, నాగరాజు, సంధ్య, సంధ్యారాణి, రాజశేఖర్, మహేశ్వరయ్య, ఉమామహేశ్వరరెడ్డి, దేవమణి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్లు తొలగించండి

గోపవరం: మండలంలోని పి.పి.కుంట నుండి బ్రాహ్మణపల్లె వరకు ఆర్అండ్‌బి రోడ్డుపై అడ్డదిడ్డంగా వేసిన స్పీడ్‌బ్రేకర్లను తొలగించాలని ప్రయాణికులతో పాటు వాహనదారులు సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. 15 కిలోమీటర్లు ఉన్న పి.పి.కుంట నుండి బ్రాహ్మణపల్లె వరకు 58 స్పీడ్ బ్రేకర్లు ఉన్నాయంటే వాహనదారుల పరిస్థితి ఏవిధంగా ఉందో చెప్పకనే తెలిసిపోతుంది. బద్వేలు నుండి బ్రాహ్మణపల్లె వరకు ఒకే ఆర్టీసీ బస్సు తిరుగుతుంది. మధ్యలో ఒక ట్రిప్పు కడపకు వెళ్ళి వస్తున్నందున ఈ ప్రాంత ప్రజలకు ఇబ్బందికరంగా ఉండటంతో బస్సును కంటిన్యూగా బ్రాహ్మణపల్లెకు తిప్పాలని ఇటీవల స్థానికులు ఆర్టీసీ డీఎం దృష్టికి తీసుకెళ్ళారు. అయితే స్పీడ్‌బ్రేకర్లు అధికంగా ఉన్నందున డ్రైవర్లు కూడా ఈ రూట్‌కు వచ్చేందుకు సముఖత చూపడం లేదని అధికారులు చెబుతున్నారు. స్పీడ్‌బ్రేకర్ల విషయంలో గతంలో బద్వేలు రూరల్ పోలీసులు ఆర్అండ్‌బి అధికారుల దృష్టికి తీసుకెళ్ళారు. మండల ప్రజల విజ్ఞప్తి మేరకు ఒకే ట్రిప్పుకు పరిమితమైన ఆర్టీసీ బస్సును రోజంతా తిప్పేందుకు ఆర్టీసీ అధికారులు అనుమతి ఇచ్చారు. అయితే స్పీడ్‌బ్రేకర్లు తొలగించకపోతే బస్సును తిరిగి రద్దు చేస్తామన్నారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న కంపచెట్లను పూర్తిస్థాయిలో తొలగించకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పీడ్‌బ్రేకర్లను తొలగించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రీ సర్వేను సద్వినియోగం చేసుకోండి



ప్రొద్దుటూరు: గ్రామసభలో సర్పంచ్ శివలక్ష్మి, అధికారులు

ప్రొద్దుటూరు: రీ సర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని రీసర్వే విభాగం డిప్యూటీ తహసీల్దారు సుదర్శన్ తెలిపారు. మండలంలోని కల్లూరు సచివాలయం వద్ద సర్పంచ్ వల్లూరు శివలక్ష్మి ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రీ సర్వే జరిగిందన్నారు. ఇంకా ఏవైనా అపరిష్కృత సమస్యలుంటే పరిష్కరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెంకటలక్ష్మి, బాదుల్లా, తదితరులు పాల్గొన్నారు.



కాశినాయన: గంగనపల్లె గ్రామసభలో అర్జీలు స్వీకరిస్తున్న డీటీ రవిశంకర్

భూ సమస్యలను పరిష్కరించుకోవాలి

కాశినాయన: భూములు రీ సర్వే జరిగిన రెవెన్యూ గ్రామాల్లోని రైతులు భూ సమస్యలు ఏవైనా ఉంటే గ్రామసభల్లో పరిష్కరించుకోవాలని డిప్యూటీ తహసీల్దారు రవిశంకర్ తెలిపారు. శుక్రవారం మండలంలోని గంగనపల్లెలో గ్రామసభ నిర్వహించారు. గతంలో రీ సర్వే జరిగిందని, రీసర్వేలో ఏవైనా పొరపాట్లు ఉంటే ఈ గ్రామసభలో దరఖాస్తు చేసుకుంటే పరిష్కరిస్తామని తెలిపారు. స్థానిక వీఆర్ఓ శ్రీనివాసులు, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి



ఎంఈఓ సావిత్రమ్మకు వినతి పత్రం అందిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ప్రొద్దుటూరు కల్చరల్: మండలంలోని ఆచార్ల కాలనీ విరాట్‌నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు ఎంఈఓ సావిత్రమ్మను కోరారు. ఎంఈఓ కార్యాలయంలో శుక్రవారం ఆమెను కలిసి వినతి పత్రం అందజేశారు. స్థానికులు జీసీ పుల్లయ్య, చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ పాఠశాలలో 126 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని, గదులు శిథిలావస్థకు చేరాయని తెలిపారు. స్లాబు కుంగి పెచ్చులూడిపడుతున్నాయని, పాఠశాల వద్ద రోడ్డు వేయడంతో వర్షపు నీరు పాఠశాలలోకి చేరుతోందని ఆరోపించారు. నాడు - నేడు పనులను పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో కుళ్లాయిరెడ్డి, శ్రీనివాసులు, ఓబన్న, అంగడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

క్యూ- స్పైడర్ కంపెనీకి సీబీఐటీ విద్యార్థుల ఎంపిక




క్యూస్పైడర్ కంపెనీ ఇంటర్న్‌షిప్‌కు ఎంపికైన సీబీఐటీ విద్యార్థులు

చాపాడు: స్థానిక చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ)కాలేజీకి చెందిన ఫైనలియర్ చదువుతున్న పలువురు విద్యార్థులు శుక్రవారం బెంగుళూరుకు చెందిన క్యూ-స్పైడర్ నిర్వహించిన ఇంటర్న్‌షిప్‌కు ఎంపికయ్యారు. క్యూ- స్పైడర్ కంపెనీ మేనేజర్లు శ్రీ సృజన, శ్రీలత ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్న్‌షిప్ సెలక్షన్‌లో 122 మంది విద్యార్థులు పాల్గొనగా మొదటి రౌండ్ అప్టిట్యూడ్ టెస్ట్ తర్వాత గ్రూపు డిస్కషన్ నిర్వహించారు. ఇందులో 24 మంది విద్యార్థులు క్యూ- స్పైడర్ కంపెనీలో ఇంటర్న్‌షిప్‌కు ఎంపికైనట్లు ప్లేస్‌మెంట్ ఆఫీసర్ శ్రీధర్ తెలిపారు. విద్యార్థులు ఇంటర్న్‌షిప్‌కు ఎంపిక కావడంతో సీబీఐటీ చైర్మన్ డా.వి.జయచంద్రారెడ్డి, అకడమిక్ డీన్ శ్రీనివాసులరెడ్డి, ప్రిన్సిపాల్ శృతి హర్షం వ్యక్తం చేశారు.

మెప్మా బజార్ ప్రారంభం



ప్రొద్దుటూరు: మెప్మా బజార్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున



మైదుకూరు: వస్తువులను కొనుగోలు చేస్తున్న మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర

ప్రొద్దుటూరు: స్థానిక శివాలయం సర్కిల్ వద్ద ఏర్పాటుచేసిన మెప్మా బజార్‌ను మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున శుక్రవారం ప్రారంభించారు. స్వయం సహాయక సంఘాల మహిళలు తయారుచేసిన ఉత్పత్తులను ఆయన పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ మహిళలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు అర్బన్ మార్కెట్‌ను ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. మెప్మా బజార్‌లో 25 స్టాల్స్ ఏర్పాటు చేశారని, ప్రజల అవరాలకు అనుగుణంగా మరిన్ని పెంచుతామని తెలిపారు. మెప్మా టీఈ మహాలక్ష్మి, మహిళలు పాల్గొన్నారు.

మైదుకూరులో...

మైదుకూరు: పట్టణంలో మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం మెప్మా ఆధ్వర్యంలో మెప్మా బజార్‌ను ప్రారంభించారు. మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర మెప్మా బజార్‌ను ప్రారంభించి స్టాళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసిన వస్తువులను మున్సిపల్ చైర్మన్ కొనుగోలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల ఆర్థిక బలోపేతానికి మెప్మా బజార్ దోహదపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాసులరెడ్డి, మెప్మా టీఈ కెజియ, సీఓలు పుల్లయ్య, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

వార్డుల్లో కమిషనర్ పర్యటన

ప్రొద్దుటూరు: మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున శుక్రవారం పర్యటించారు. టీబీ రోడ్డులోని ఎద్దుల వెంకట సుబ్బమ్మ బాలికోన్నత పాఠశాల సమీపంలో చెత్తను సిబ్బందితో తొలగింప జేశారు. మైదుకూరు రోడ్డులోని సున్నంబట్టీ వీధి, మైదుకూరు రోడ్డు ప్రధాన కాలువల్లో పూడికతీత పనులు వెంటనే చేపట్టాలని కమిషనర్ ఆదేశించారు.

ఆత్మస్థైర్యంతో దాడులను ఎదుర్కోవాలి



మాట్లాడుతున్న మహిళా సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు

ప్రొద్దుటూరు క్రైం: అమ్మాయిలు ఆత్మస్థైర్యంతో దాడులు ఎదుర్కోవాలని మహిళా సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు తెలిపారు. స్థానిక గీతం మహిళా జూనియర్ కళాశాలలో శుక్రవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా ఎలా ఆత్మస్థైర్యంతో ఉండాలనే విషయాలపై వివరించారు. కళాశాలలో మహిళా రక్షణ కమిటీలు వేయాలని తెలిపారు. అత్యాచారాలకు కారణమవుతున్న మద్యం, పోర్న్ వీడియోస్, డ్రగ్స్‌ను ప్రభుత్వాలు నిషేధించాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు భారతి, ఉషారాణి, వరలక్ష్మి, లక్ష్మీదేవి, బాబక్క, రెహెనా, హరిత, పద్మ, రుక్సాన, విద్యార్థినులు పాల్గొన్నారు.

విద్యావ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న కూటమి ప్రభుత్వం

ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గోవిందరెడ్డి

పోరుమామిళ్ల: గత ప్రభుత్వ పాలనలో విప్లవాత్మక మార్పులతో కళకళలాడిన సర్కారు బడులు నేడు కూటమి ప్రభుత్వ పాలనలో మసకబారుతున్నాయని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యావ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నదన్నారు. తల్లికి వందనం ఊసే లేదన్నారు. ఫీజు రీఎంబర్స్ మెంట్‌పై నోరు మెదపటం లేదన్నారు. వైఎస్ జగన్ పాలనలో నాడు-నేడు, ఇంగ్లీష్ మీడియం, ఐబీ వైపు అడుగులు, సబ్జెక్టు టీచర్ల కాన్సెప్ట్, తరగతి గదుల్లో 6వ తరగతి నుంచి ఇంటరాక్టివ్ ఫ్లాట్ పానల్స్, 8వ తరగతిలో ట్యాబుల పంపిణీ, విద్యాకానుక, రోజుకో మెనూతో గోరుముద్ద ఇలా పేద పిల్లల తలరాతలను మార్చే చదువులను అందించి విజయవంతంగా అమలు చేశారన్నారు. నాడు-నేడుతో కార్పొరేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధిపరచి, డిజిటల్ క్లాస్ రూములను ఏర్పాటు చేశారన్నారు. అయితే కూటమి పాలనలో ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ అధ్వానంగా మారుతోందన్నారు. జగన్ పాలనలోని విద్యాపథకాలను ఒక్కొక్కటిగా రద్దు చేస్తూ వస్తున్నారన్నారు. పలుచోట్ల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపడం మానేస్తున్నారన్నారు. విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిందన్నారు. మధ్యాహ్న భోజనంలో రుచి-శుచి మాయమవుతోందన్నారు. ఉపాధ్యాయుల సర్దుబాటు తూతూమంత్రంగా ఉండటంతో బోధన అస్తవ్యస్తంగా తయారయిందన్నారు. పాఠశాలల నిర్వహణకు అరకొర నిధులను మాత్రమే ఈ ప్రభుత్వం మంజూరు చేస్తున్నదన్నారు. తల్లులను కూటమి ప్రభుత్వం పచ్చిగా మోసం చేస్తోందని, తల్లికి వందనం కాదని, తల్లులకు పంగనామాలు అన్నట్లు వ్యవహరిస్తోందని గోవిందరెడ్డి ఆరోపించారు. నీకు పదిహేను....నీకు పదిహేను.... అంటూ ఇంట్లో ఎంతమంది ఉంటే ఇలా అందరికీ రూ. 15 వేలు చొప్పున ఇస్తామని ప్రకటించి ఇంతవరకు ఇవ్వలేదన్నారు. కళాశాల ఫీజు, హాస్టల్, మెస్ ఫీజులు చెల్లించలేక విద్యార్థులు సతమత మవుతున్నారని, పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల బకాయిలు కూటమి ప్రభుత్వం త్వరగా చెల్లించాలన్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ ఉండి ఉంటే క్వార్టర్ ముగియగానే ఫీజు రీఎంబర్స్‌మెంట్, వసతిదీవెన, విద్యాదీవెన డబ్బులు నేరుగా తల్లుల ఖాతాల్లో వేసేవారని తల్లిదండ్రులు బాహాటంగా చెప్పుకుంటున్నారన్నారు. తిరోగమన నిర్ణయాలతో ప్రభుత్వ బడులను కూటమి ప్రభుత్వం మళ్లీ మొదటికే తీసుకెళుతున్నదని గోవిందరెడ్డి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీషు మీడియాన్ని వ్యతిరేకిస్తూ కోర్టులకెళ్లి అడ్డుకున్న తీరును ప్రజలు ఇప్పటికీ మరచి పోలేదన్నారు. కూటమి ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోవాలని గోవిందరెడ్డి హితవు చెప్పారు.

బ్యాడ్మింటన్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ జయరామిరెడ్డి

ప్రొద్దుటూరు: వైవీయూ ఇంటర్ కాలేజ్ బ్యాడ్మింటన్ పోటీల్లో స్థానిక వైఎస్సార్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపల్ ఆచార్య బి.జయరామిరెడ్డి తెలిపారు. కళాశాలలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ బద్వేల్‌లోని ఎస్‌బీవీఆర్ కాలేజీలో గురువారం జరిగిన బ్యాడ్మింటన్ పోటీల్లో ఉమెన్స్ డబుల్స్‌లో ఆర్.జయశ్రీ, జి.వాణి, జి.మానస ప్రథమ, సింగిల్స్‌లో హెచ్.నిరీష ద్వితీయ స్థానం సాధించినట్లు తెలిపారు. మెన్స్ డబుల్స్‌లో ఎ.గోపాల్, డి.రవితేజ, కె.వర్షిత్ తృతీయ స్థానం సాధించారన్నారు. చెన్నైలో జరిగే ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు తమ కాలేజీ విద్యార్థి కె.వర్షిత్ ఎంపికయ్యారన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రిన్సిపల్, డీన్ ఆచార్య డాక్టర్ కేవీ.రమణయ్య, ఎస్.రఘునాథరెడ్డి, ఎ.రాజవేఖర్, పి.ప్రకాష్‌రెడ్డి, పి.ధనసూదన్‌రెడ్డి, పి.రామదాసు, వివిధ డిపార్ట్‌మెంట్ విభాగాధిపతులు అభినందించారు.

అంతర్ కళాశాలల పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ కనపరచిన విద్యార్థులతో ప్రిన్సిపల్

ప్రొద్దుటూరు కల్చరల్: బద్వేల్‌లో జరిగిన వైవీయూ అంతర్ కళాశాలల బ్యాడ్మింటన్ పోటీల్లో స్థానిక లేపాక్షి డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. తృతీయ సంవత్సరం విద్యార్థి ప్రవీణ్ మెన్స్ సింగిల్స్ విభాగం బ్యాడ్మింటన్ పోటీల్లో ద్వితీయ స్థానం, మొదటి సంవత్సరం విద్యార్థిని షేక్ అదిల్లా షరీన్ ఉమెన్స్ సింగిల్స్ విభాగంలో తృతీయ స్థానంలో నిలిచారు. వీరిని ప్రిన్సిపల్ రామచంద్రారెడ్డి, కరస్పాండెంట్ వీరరాఘవరెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

ఆక్రమణలకు గురైన భూములను స్వాధీనం చేసుకోవాలి

అట్లూరు: ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని పేదలకు అసైన్‌మెంటు కమిటీ ద్వారా పంపిణీ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షురాలు దుర్గమ్మ, కార్యదర్శి రమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వ భూములు అధికారపార్టీ నాయకుల ఆక్రమణలకు గురై రోజు రోజుకు తరిగి పోతున్నాయన్నారు. ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూములను రెవెన్యూ అధికారులు గుర్తించి తిరిగి స్వాధీనం చేసుకోవాలన్నారు. అలాగే అర్హులైన పేదలను గుర్తించి ప్రభుత్వ భూములను అసైన్‌మెంటు కమిటీ ద్వారా పంపిణీ చేయాలన్నారు.

పన్ను వసూళ్ల కోసం ప్రత్యేక కార్యాచరణ

బద్వేలు అర్బన్: పట్టణంలో పన్ను బకాయిల వసూళ్ళ కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ వాకమళ్ళ రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డితో వివిధ అంశాలపై చర్చించి మాట్లాడారు. ఆస్తి, నీటిపన్నుల వసూళ్ళ కోసం ప్రత్యేక టీంలు ఏర్పాటు చేయాలని కోరారు. దీర్ఘకాలికంగా పన్నులు పెండింగ్‌లో ఉన్న సంబంధిత యజమానులకు నోటీసులు అందజేయాలని సూచించారు. అలాగే ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. గాంధీనగర్ సచివాలయం పరిధిలో నిర్వహించిన ఫ్రైడే-డ్రైడే కార్యక్రమంలో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా పరిసరాల పరిశుభ్రతను పాటించాలని కోరారు. అనంతరం దోమల వలన వచ్చే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం సచివాలయాన్ని తనిఖీ చేసి పలు రికార్డులు పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శివరామిరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలి



బి.కోడూరులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

బి.కోడూరు: సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని బి.కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు తెలిపారు. శుక్రవారం బి.కోడూరులో ఫ్రైడే-డ్రైడే కార్యక్రమంలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, దోమ లార్వా నియంత్రణ, డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా, ఫైలేరియా వంటి జబ్బుల గురించి అవగాహన కల్పించాలన్నారు. ప్రజలు దోమల పట్ల తగు జాగ్రత్తలు పాటించాలని, దోమతెరలు వాడాలని, ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ వినీత్‌కుమార్‌రాజు, డాక్టర్ ఉదయ్‌కిరణ్, పోరుమామిళ్ళ సబ్ యూనిట్ అధికారి టి.నరసింహారెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.